
సాక్షి పల్నాడు

ఆదివారం ၊ 24 ၊ డిసెంబర్ ၊ 2023



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 522.80 అడుగుల వద్ద ఉంది. ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 19,012 క్యూసెక్కులు విడుదల చేశారు.



నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి: ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి విజయవాడకు చెందిన భక్తులు శనివారం రూ. 5 లక్షలు విరాళాన్ని అందజేశారు.

స్పందన కార్యక్రమం రద్దు

బాపట్ల అర్బన్: క్రిస్మస్ పండుగ సందర్భంగా సోమవారం స్పందన కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్టు బాపట్ల జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా శనివారం వెల్లడించారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.



న్యూస్‌రీల్

పరిశోధనలపై ఆసక్తి పెంచుకోవాలి



నరసరావుపేట ఈస్ట్: పాఠశాల విద్య నుంచే విద్యార్థులు పరిశోధనల పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.శామ్యూల్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనను హార్డ్ పాఠశాలలో నిర్వహించారు. జిల్లాలోని 28 మండలాల నుంచి 84 నమూనాలు ప్రదర్శనలో పాల్గొన్నాయి. డీఈఓ శామ్యూల్ మాట్లాడుతూ సమాజ అవసరాలకు అనుగుణంగా నూతన వస్తుసేవల ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని కోరారు. ప్రదర్శనలో భాగంగా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఈనెల 28, 29 తేదీలలో వైఎస్సార్ కడప జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొని పల్నాడు జిల్లాకు బహుమతులు తీసుకరావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ వేణుగోపాలరావు, జిల్లా సైన్స్ ఆఫీసర్ ఏ.ఏ.మధుకుమార్, సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సందడిగా బాలోత్సవం



నరసరావుపేట ఈస్ట్: జిల్లాస్థాయి బాలోత్సవం శనివారం పీఎన్‌సీ అండ్ కేఆర్ కళాశాల ఆవరణలో ప్రారంభమైంది. బాలోత్సవ్ పోటీలను ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులలో సృజనాత్మకత పెరిగేందుకు బాలోత్సవం దోహదపడుతుందని తెలిపారు. తరగతి గదిలో చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు, కళల పట్ల విద్యార్థులు ఆసక్తిని పెంచుకోవాలన్నారు. తొలిరోజు పోటీలలో జిల్లా నలుమూలల నుంచి దాదాపు 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా తొమ్మిది వేదికలపై సాంస్కృతిక, విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలను నిర్వహించారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాలలో 65 ఈవెంట్లలో పోటీలు నిర్వహించారు. ఆయా పోటీలలో విజేతలైన విద్యార్థులకు ప్రదర్శనల వారీగా ఎప్పటికప్పుడు బహుమతులను అందచేశారు.

అయోధ్య నుంచి అక్షింతలు



రొంపిచర్ల: అయోధ్య నుంచి శ్రీరామ పూజా అక్షింతలు పవిత్ర కలశాలు శనివారం పల్నాడు జిల్లా రొంపిచర్లకు చేరుకున్నాయి. స్థానిక శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరీ ఆలయంలో రాష్ట్రీయ స్వయంసేవక్, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శ్రీ రామ పూజా అక్షింతలు మండలంలో అన్ని గ్రామాలకు ఆదివారం పంపిణీ చేస్తామని రాష్ట్రీయ స్వయంసేవక్, విశ్వ హిందూ పరిషత్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గొడవర్తి వెంకటేశ్వర్లు, పేరేచర్ల కోటేశ్వరరావు, బలరామరాజు, అర్వపల్లి విశ్వేశ్వరరావు, పూజల కొండలు, మొక్కారి మధుసూదనరావు, పట్టబూరి ప్రభాకర్, పసుమర్తి ఆదినారాయణ, సుబ్బారాయిడు, భక్తులు పాల్గొన్నారు.

నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శనివారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2,000, గరిష్ట ధర రూ.2,800, మోడల్ ధర రూ.2,400 వరకు పలికింది.

అట్టహాసం..సంబరమాశ్చర్యం

❖ గుంటూరులో నంది నాటకోత్సవాలు ప్రారంభం ❖ కళాభిమానులు, విద్యార్థులతో కిక్కిరిసిన ప్రాంగణం

- నాటక రంగ పరిరక్షణ కోసమే నంది నాటకోత్సవం
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ
- వివిధ ప్రాంతాల నుంచి హాజరైన కళాకారులు
- తొలి రోజు నాలుగు పద్య, సాంఘిక నాటక ప్రదర్శనలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, రాష్ట్ర చలనచిత్ర టీవీ నాటక రంగ అభివృద్ధి సంస్థ చైర్మన్ పోసాని కృష్ణమురళి, ఎండీ విజయ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

పాత గుంటూరు: అంతరించిపోతుందనుకుంటున్న తరుణంలో నాటక రంగ పరిరక్షణ కోసం, నిరుత్సాహంగా ఉన్న కళాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నంది నాటకోత్సవాలు నిర్వహిస్తుందని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. గుంటూరులోని వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో రాష్ట్ర చలనచిత్ర టీవీ నాటక రంగ అభివృద్ధి సంస్థ చైర్మన్ పోసాని కృష్ణమురళి ఆధ్వర్యంలో నంది నాటకోత్సవాలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. స్వరాజ్య సమరయోధుడు బలిజేపల్లి లక్ష్మీకాంతం జయంతి సందర్భంగా ఆయన పేరుతో కళా ప్రాంగణంలో ఉత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథి మంత్రి చెల్లుబోయిన జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సభకు సంస్థ ఎండీ టీ.విజయ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షత వహించారు. మంత్రి మాట్లాడుతూ కళాకారుల జీవన ప్రమాణాల పట్ల ప్రభుత్వానికి ఒక ఆశయం, చిత్తశుద్ధి ఉందన్నారు. పేద, మధ్యతరగతి కళాకారుల అభ్యున్నతికి ఈ నంది నాటక ప్రదర్శనలు దోహదపడతాయన్నారు.

టీడీపీ హయాంలో కళాకారులకు అన్యాయం

సంస్థ చైర్మన్ పోసాని కృష్ణమురళి మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో అర్హత కలిగిన నాటక రంగ సంస్థలు, కళాకారులకు అన్యాయం జరిగిందని అన్నారు. అనర్హులకు నంది అవార్డులు అందించిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. సీఎం జగన్ పాలనలో ఏ ఒక్క అనర్హుడికి నంది అవార్డు దక్కదని స్పష్టం చేశారు. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా 27 మంది కళాకారులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించనున్నట్లు తెలిపారు. సంస్థ ఎండీ విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ మంత్రి చెల్లుబోయినకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జాయింట్ కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ కళాకారులకు ధన్యవాదాలు తెలిపారు. ప్రేక్షకులతో విజ్ఞాన మందిరం ప్రాంగణమంతా కిక్కిరిసింది. విద్యార్థులు, కళాభిమానుల కరతాళ ధ్వనులతో ప్రాంగణం మార్మోగింది. ఆవరణలో ఎల్ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. కళాకారుల వసతి, మేకప్ సదుపాయాలు, భోజనం ఏర్పాట్లు సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు.



శ్రీకాళహస్తీశ్వరం నాటకంలోని సన్నివేశం

లక్ష్మీకాంతంకు నివాళి

మంత్రితోపాటు ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, సంస్థ చైర్మన్ పోసాని కృష్ణమురళి, డైరెక్టర్ టి.విజయ్‌కుమార్, జేసీ జి.రాజకుమారి, మేయర్ కావటి మనోహర్, డిప్యూటీ మేయర్ షేక్ సజీల, రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ ఎం.శేషగిరిరావు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరి ఫాతిమా పాల్గొని మహనీయుడు బలిజేపల్లి లక్ష్మీకాంతం చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు

తొలిరోజు ప్రదర్శించిన రెండు పద్య నాటకాలు, రెండు సాంఘిక నాటకాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. డాక్టర్ మీగడ రామలింగస్వామి రచనకు, మీగడ మల్లికార్జునస్వామి దర్శకత్వం వహించిన శ్రీ కాళహస్తీశ్వరం పౌరాణిక పద్యనాటకం రసవత్తరంగా సాగింది.

▸ రాజాం కళాసాగర్ నాటక సంక్షేమ సేవా సంఘం అధ్యక్షులు మెట్ట దామోదరరావు నిర్వహించారు. ఆకురాతి భాస్కర్ శర్మ రచనా, దర్శకత్వంలో ఎర్ర కాలువ సాంఘిక నాటిక ప్రేక్షకులను ఆలోచింపచేసింది.

▸ తాళాబత్తుల వెంకటేశ్వరరావు రచన, నాటకీరణలో నాన్నా నేనొచ్చేస్తా సాంఘిక నాటిక, గుంటూరు జిల్లా కొల్లూరు మండలం అనంతవరం శ్రీ దుర్గా భవానీ నాట్యమండలి వారి శ్రీ రామభక్త తులసీదాసు పౌరాణిక నాటకం ప్రేక్షకుల ప్రశంసలు పొందాయి.

నేటి నాటక ప్రదర్శనలు ఇవే..

- ఉదయం 9:30 గంటలకు విజయవాడ సంస్కార భారతి నిర్వహణలో డాక్టర్ పి.వి. ఎస్ కృష్ణ రచన దర్శకత్వంలో శ్రీ మాధవ వర్మ పద్య నాటకం
- మధ్యాహ్నం 12:30 గంటలకు రాప్తాడు అరబి యూత్ అండ్ కల్చరల్ అసోసియేషన్ నిర్వహణలో ఆముదాల సుబ్రహ్మణ్యం రచనా, దర్శకత్వంలో 'బాధ్యత' బాలల నాటిక
- 2:30 గంటలకు హైదరాబాద్ విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ నిర్వహణలో శ్రీ ఆకెళ్ల రచన, బీఎం రెడ్డి దర్శకత్వంలో 'కలనేత' సాంఘిక నాటకం.
- సాయంత్రం 4:30 గంటలకు కరీంనగర్ చైతన్య కళాభారతి నిర్వహణలో వరమాత్ముని శివరాం రచన, రమేష్ మంచాల దర్శకత్వంలో 'చీకటి పువ్వు' సాంఘిక నాటిక
- 6 గంటలకు తిరుపతి నందనం అకాడమీ నిర్వహణలో డాక్టర్ పి.వివేక్ రచన, దర్శకత్వంలో 'ఉద్ధం సింగ్' కళాశాల, విశ్వవిద్యాలయాల నాటిక
- రాత్రి 7:30 గంటలకు పొన్నూరు రసఝరి నిర్వహణలో ఎల్లాప్రగడ భాస్కరరావు రచన, వై.ఎస్.కృష్ణేశ్వరరావు దర్శకత్వంలో 'త్రిజుడు' సాంఘిక నాటిక.
- 9.00 గంటలకు కొలకలూరు శ్రీసాయి ఆర్ట్స్ నిర్వహణలో రామకృష్ణారావు కథకు, శ్రీ స్నిగ్ధ నాటకీకరణ, గోపరాజు విజయ్ దర్శకత్వంలో 'గమ్య స్థానాల వైపు' నాటిక ప్రదర్శన.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

26న 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీల ప్రారంభోత్సవానికి గుంటూరుకు రాక



అధికారులతో మాట్లాడుతున్న సీఎం ప్రోగ్రామ్స్ కో ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల

గుంటూరు రూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం నల్లపాడులోని లయోలా పబ్లిక్ స్కూల్లో ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలను ప్రారంభించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాలరెడ్డితో కలసి సీఎం ప్రోగ్రామ్స్ కో ఆర్డినేటర్ తలశిల రఘురామ్ శనివారం పరిశీలించారు. వీరి వెంట రాష్ట్ర యువజన సర్వీసులు, పర్యాటక సాంస్కృతికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సి ప్రద్యుమ్న, ఎస్పీ ఆరీఫ్ హాఫీజ్, సంయుక్త కలెక్టర్ జి రాజకుమారి, నగర పాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి, శాప్ మేనేజింగ్ డైరెక్టర్ ధ్యానచంద్ ఉన్నారు. క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్ క్రీడాంశాలకు సంబంధించి ఆట స్థలాలను పూర్తిగా సిద్ధం చేయాలన్నారు. ఆటల పోటీల నిర్వహణ ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ అధికారులతో చర్చించి సూచనలు అందించారు. ఏర్పాట్లు, బందోబస్తు, ఇతర సౌకర్యాల్లో ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. లా అండ్ ఆర్డర్ అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, ఏఆర్ అదనపు ఎస్పీ కే కోటేశ్వరరావు, సౌత్ సబ్ డివిజన్ డీఎస్పీ మహబూబ్ బాషా, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ రత్నస్వామి, ఆర్డీఓ పీ శ్రీఖర్, డీఎస్ఓ కోమలి పద్మ, వెస్ట్ తహసీల్దారు సాంబశివరావు, నల్లపాడు సీఐ రాంబాబు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి జగన్ పర్యటన ఏర్పాట్లపై స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి శనివారం సమీక్షించారు. జేసీ జి.రాజకుమారి, జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి పాల్గొన్నారు.

గుడివాడ బుడతడికి గ్లోబల్ కిడ్స్ అచీవర్స్ అవార్డు




ప్రదీప్ నారాయణ్

తెనాలి: రెండేళ్ల ఏడు నెలల బుడతడు బండికళ్ల ప్రదీప్‌నారాయణ్ తన అసాధారణ జ్ఞాపకశక్తితో అవార్డులను కొల్లగొడుతున్నాడు. రెండు జాతీయ రికార్డులు, ఎనిమిది ప్రపంచ రికార్డులు సాధించిన ఈ బాలుడు తాజాగా గ్లోబల్ అచీవర్స్ అవార్డ్-2023కు ఎంపికవటం విశేషం. గ్లోబల్ కిడ్ అచీవర్స్ అనేది ప్రతిష్టాత్మకమైన గ్లోబల్ అవార్డు వేడుక. ప్రపంచంలోని వందమంది చైల్డ్ అచీవర్స్‌ను గుర్తించి అవార్డులను ప్రకటిస్తుంది. ఈ ఏడాది వర్చువల్‌గా నిర్వహించిన అవార్డుల ఎంపికకు ప్రపంచవ్యాప్తంగా 15 వేల ఎంట్రీలు రాగా, వీటిలో వందమందిని ఎంపికచేసి అవార్డులకు ఎంపిక చేయగా, ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రదీప్ నారాయణ్‌కు ఈ అవార్డు దక్కింది. గుంటూరు జిల్లా తెనాలి రూరల్ మండలం గుడివాడకు చెందిన సాఫ్ట్‌వేర్ దంపతులు గుణప్రియ, బండికళ్ల రాజేష్‌ల ఏకైక పుత్రరత్నం ఈ బాలుడు. వర్క్ ఫ్రమ్ హోంలో భాగంగా స్వస్థలం నుంచే విధులు నిర్వర్తిస్తున్నారు. వీరి కుమారుడు ప్రదీప్ నారాయణ్ ఏడాదిన్నర వయసు నుంచే చిన్న చిన్న వస్తువులు, జంతువులు, కూరగాయలు, ఇతర వస్తువులు, శరీరభాగాల పేర్లను చెప్పగలుతున్నాడు. పిల్లాడిలోని జ్ఞాపకశక్తికి అబ్బురపడిన తల్లిదండ్రులు కంప్యూటర్లో వివిధ అంశాలను ప్రదర్శిస్తూ నేర్పించసాగారు. ఈ క్రమంలో 150 పేర్లను కేవలం 11 నిముషాల్లోనే గుర్తించి చెప్పగలిగిన అసాధారణ ప్రతిభను సాధించాడు. ఈ వీడియోలను తీసి వివిధ రికార్డు సంస్థలకు పంపటం ఆరంభించారు. ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్, కలాం వరల్డ్ రికార్డ్, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్, ఇన్ఫ్లుయెన్షనల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఇంటర్నేషనల్ అవార్డు, ఇండియా వరల్డ్ రికార్డ్స్, వరల్డ్ వైడ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌తోపాటు జాతీయస్థాయిలో మ్యాజిక్ బుక్ ఆఫ్ రికార్డ్స్, నేషనల్ అచీవర్స్ అవార్డును అందుకున్నాడు. తాజాగా 31 నెలల వయసులో గ్లోబల్ కిడ్స్ అచీవర్స్ 2023 అవార్డు లభించటంతో తల్లిదండ్రుల ఆనందం అంతాఇంతా కాదు.

మెరుగైన బోధనతో ఉత్తమ ఫలితాలు

తోట్లవల్లూరు/ఉయ్యూరు: ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ఉపాధ్యాయులు మెరుగైన బోధన సాగిస్తూ ఉత్తమ ఫలితాలను సాధించాలని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి(పాఠశాల విద్య) ప్రవీణ్ ప్రకాష్ ఆదేశించారు. కృష్ణా జిల్లా తోట్లవల్లూరు మండలం చాగంటిపాడు, వల్లూరుపాలెం గ్రామాలలోని పాఠశాలలను శనివారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. చాగంటిపాడు ఎంపీయూపీ పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయులు లెక్కలు ఎలా బోధిస్తారంటూ హెచ్ఎం హిమకుమారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వల్లూరుపాలెం మండల పరిషత్ పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్యను హెచ్ఎం శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక జెడ్పీ పాఠశాలలో తొమ్మిదో తరగతి విద్యార్థులు ఆరుగురే ట్యాబులు తేవటంపై ప్రవీణ్ ప్రకాష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఈఓ తాహెరా సుల్తానా, డీవైఈఓ పద్మారాణి, ఎస్ఎస్ఏ ఏపీసీ రామ్‌నాయక్ పాల్గొన్నారు.



■ ఉయ్యూరు మండలం ఆకునూరు ప్రభుత్వ పాఠశాల, జూనియర్ కళాశాలను రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి(పాఠశాల విద్య) ప్రవీణ్ ప్రకాష్ శనివారం ఆకస్మికంగా సందర్శించారు.

జమ్మూ కశ్మీర్‌పై మహారాష్ట్ర జట్టు విజయం



మహారాష్ట్ర బౌలర్ డి.ఎ.జోర్

తాడేపల్లిరూరల్: మంగళగిరి పట్టణ పరిధిలోని ఏసీఏ ఇంటర్నేషనల్ స్టేడియంలో శనివారం జమ్మూ కశ్మీర్, మహారాష్ట్ర జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచిన మహారాష్ట్ర జట్టు బ్యాటింగ్ ఎన్నుకుంది. రెండవ ఇన్నింగ్స్‌లో జమ్మూ కశ్మీర్ జట్టులో బ్యాట్స్‌మెన్ అసరర్ అజాద్ 19 బంతులకు 37 పరుగులు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన మహారాష్ట్ర జట్టులో బౌలర్ డి.ఎ.జోర్ 10 ఓవర్లలో 5 వికెట్లు తీసుకుని, 23 పరుగులు ఇచ్చాడు. మహారాష్ట్ర జట్టుకు 7 పాయింట్లు దక్కగా, జమ్మూ కశ్మీర్ జట్టు 0 పాయింట్లతో సరిపెట్టుకుంది.

దుర్గమ్మకు బంగారు హారం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మకు కర్ణాటకకు చెందిన భక్తుడు శనివారం బంగారపు హారాన్ని కానుకగా సమర్పించారు. కర్ణాటక కుల్‌కురేకు చెందిన మంజునాథ్ కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఆలయ అధికారులను కలిసి సుమారు రూ.4 లక్షలతో తయారు చేయించిన 70 గ్రాముల బంగారపు లక్ష్మీహారాన్ని అమ్మవారికి కానుకగా సమర్పించింది. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు ఈఈ కోటేశ్వరరావు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలను బహూకరించారు.

ముక్కోటి..భక్తకోటి



ఉత్తర ద్వార దర్శనంలో శ్రీదేవి భూదేవి సమేత నారసింహుడిని దర్శించుకుంటున్న భక్తులు

- ముక్కోటికి కిటకిటలాడిన మంగళాద్రి
- ఉత్తర ద్వారంలో దర్శనమిచ్చిన స్వామి
- రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి రాక

తాడేపల్లిరూరల్: నగరంలో వేంచేసియున్న లక్ష్మీనరసింహస్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. ముక్కోటి ఏకాదశి సందర్భంగా దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధి గాంచిన శ్రీదేవి భూదేవి సమేత నారసింహుని ఉత్తర ద్వార దర్శనంలో దర్శించుకున్న భక్తులు భక్తి పారవశ్యంలో మునిగి తేలారు. శుక్రవారం రాత్రి బంగారు గరుడ వాహనంపై జగన్మోహిని అలంకారంలో గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం ఆలయానికి చేరుకున్న స్వామివారి ప్రత్యేక పూజలు, ప్రత్యేక అలంకరణతో తిరువంజనోత్సవం నిర్వహించుకుని శ్రీదేవి భూదేవి సమేతుడై బంగారు గరుడ వాహనంపై శనివారం తెల్లవారు జామున 3 గంటలకు ఉత్తర ద్వార దర్శనంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్తర ద్వార దర్శనంలో స్వామి వారిని దర్శించుకున్న భక్తులు బంగారు శంఖుతో తీర్థం స్వీకరించారు. ముక్కోటి సందర్భంగా స్వామివారిని ఉత్తర ద్వార దర్శనంలో పలువురు న్యాయమూర్తులు, రాష్ట్ర సమాచార ప్రసార సినిమాటోగ్రఫీ శాఖమంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ, జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి, వైఎస్సార్‌సీపీ నాయకులు, వివిధ పార్టీల నాయకులు, పలువురు న్యాయవాదులు, అధికారులు దర్శించుకున్నారు.



భక్తులకు బంగారు శంఖుతో తీర్థం

క్లుప్తంగా

లైసెన్స్ లేకుండా కల్లు గీస్తే చర్యలు

జిల్లా ఎక్సైజ్ అధికారి వెంకటేశ్వర్లు

పిడుగురాళ్ల: కల్లు గీత కార్మికులు లైసెన్స్ లేకుండా కల్లు గీస్తే చర్యలు తప్పదని జిల్లా ఎక్సైజ్ అధికారి డి.వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రం నుంచి కొంత మంది కల్లు గీత కార్మికులు లైసెన్స్‌లు లేకుండా ఆంధ్ర ప్రాంతంలో ప్రత్యేకించి పల్నాడు ప్రాంతంలో కల్లు గీస్తూ ప్రజలకు కల్తీ కల్లు అమ్ముతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఇటువంటి కల్తీ కల్లు విక్రయించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందని చెప్పారు. ఆయన వెంట ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎండీ గౌస్ బాషా ఉన్నారు.

ఐఏఎస్ యువతితో పెళ్లిచేస్తానని..

రూ.లక్షలు కాజేసి ఉడాయించాడు!

మోసగించాడంటూ బాధితుల ఫిర్యాదు

పట్నంబజారు: ఐఏఎస్ యువతితో వివాహం చేస్తానని చెప్పి యువకులను మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదైంది. అరండల్‌పేట పోలీసుల కథనం ప్రకారం కృష్ణా జిల్లా నూజివీడుకు చెందిన సంతోష్‌బాబు శ్రీకాకుళం జిల్లా నిలిమర్లలో నర్సింగ్ అభ్యసించాడు. తనకు తెలిసిన ఐఏఎస్ యువతి ఉందని, ఆమెతో వివాహం చేస్తానని పలువురు యువకులకు చెప్పాడు. శ్రీనగర్‌కు చెందిన చాగంటి కాశిరెడ్డి వద్ద రూ. 15 లక్షలు, కర్నూలు జిల్లాకు చెందిన మల్లికార్జునరావు వద్ద రూ. 8.50 లక్షలు తీసుకుని మోసం చేశాడు. ఐఏఎస్ యువతి లేదని తెలుసుకున్న మోసపోయామని తెలుసుకున్న బాధితులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన పాలిటెక్నిక్ క్రీడా పోటీలు



గుంటూరు ఎడ్యుకేషన్: గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో రెండు రోజుల పాటు జరిగిన జిల్లాస్థాయి పాలిటెక్నిక్ విద్యార్థినుల క్రీడాపోటీలు శనివారం ముగిశాయి. ఈసందర్భంగా ఆటల పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను సెయింట్ మేరీస్ పాలిటెక్నిక్, గేమ్స్ చాంపియన్‌షిప్‌ను గుంటూరులోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కైవసం చేసుకున్నారు. క్రీడల్లో వ్యక్తిగత చాంపియన్‌షిప్ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ విద్యార్థిని ఎం.లావణ్య దక్కించుకుంది. ఈసందర్భంగా బహుమతి ప్రదానోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్యార్థినులు అత్యంత క్రీడాస్ఫూర్తి, క్రమశిక్షణ, మెలకువలతో కూడిన నైపుణ్యంతో ఆటలు ఆడారని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. ప్రభాకరరావు పర్యవేక్షణలో జరిగిన క్రీడాపోటీలకు జిల్లా నోడల్ అధికారిగా టి. శేఖర్, పొన్నూరు పాలిటెక్నిక్ ఫిజికల్ డైరెక్టర్ విజయకుమార్‌తో పాటు వివిధ కళాశాలల పీడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉత్తర ద్వార దర్శనానికి పోటెత్తిన భక్తులు

అమరావతి: స్థానిక శ్రీబాల చాముండికా సమేత అమరేశ్వరుని దేవాలయంలో భక్తులు ముక్కోటి ఏకాదశి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శనివారం వేకువజామున ఆలయంలోన ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. అనంతరం స్వామి ఉత్సవ మూర్తులను రాజవీధికి అభిముఖంగా ఉన్న గాలిగోపురంలో భక్తుల దర్శనార్థం ఉంచారు. తరువాత వైభవంగా స్వామి గ్రామోత్సవం నిర్వహించారు. అలాగే గ్రామంలోని కోదండ రామాలయం, పాండురంగస్వామి దేవాలయాలలో భక్తులు ఉదయాన్నే స్వామి వారిని ఉత్తర ద్వార దర్శనం చేసుకుని పూజలు నిర్వహించారు. ఉత్సవాలను దేవాలయ ఈఓ వేమూరి గోపి పర్యవేక్షించారు.

వైకుంఠపురంలో..

మండల పరిధిలోని వైకుంఠపురంలో శనివారం వేకువ జామున స్వామివారిని ఉత్తర గాలిగోపురంలో ఉంచి భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే మూలవిరాట్‌కు కూడా విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చాడు. అనంతరం మేళతాళాలతో ఉభయ దేవేరులతో కూడిన వేంకటేశ్వరుని పురవీధులలో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ విశ్వనాథ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



గరుడ వాహనంపై ఉభయ దేవేరులతో వైకుంఠపురం వేంకటేశ్వరుడు

వయోభేదం మరచి.. రాయితో దాడి చేసి

- వృద్ధుడిపై తండ్రీ కొడుకుల దౌర్జన్యం
- తీవ్రంగా గాయపడిన వృద్ధుడు
- పోలీసుల అదుపులో నిందితులు..
- వదిలివేయాలంటూ ఆలపాటి ఒత్తిడి
- రాజకీయ రంగు పులిమేందుకు యత్నం

తెనాలిరూరల్: స్వల్ప విషయమై ఓ వృద్ధుడిని తండ్రీ కొడుకులు రాయితో దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన ఘటన బుర్రిపాలెంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామంలో సిమెంటు రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అందుకోసం గ్రామంలో సదరు కాంట్రాక్టరు కంకరు తోలించాడు. గ్రామానికి చెందిన నరసింహమూర్తి, అతని కొడుకు వంశీకృష్ణ ఇంట్లో శుభకార్యం ఉండడంతో వారి ఇంటి పక్కన ఉన్న కంకరును శనివారం ఉదయం పొక్లెయిన్‌తో 70 ఏళ్ల పాండురంగారావు ఇంటి ముందుకు నెట్టించారు. దీనిపై తండ్రీ కొడుకులను ప్రశ్నించగా వారు ఘర్షణకు దిగడంతో పాటు వృద్ధుడని చూడకుండా అతనిపై రాయితో దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితుడిని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు, నిందితులైన తండ్రీ కొడుకులను అదుపులోకి తీసుకుని రూరల్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు.



అయితే విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తమ పార్టీ కార్యకర్తలైన నిందితులను వెంటనే పంపించాలని పోలీసులను డిమాండ్ చేశారు. గ్రామ పెద్దలలో ఒకడైన పాండు రంగారావుపై దాడి విషయానికి రాజకీయ రంగు పులిమేందుకు ప్రయత్నించారు. పాండు రంగారావు వైఎస్సార్ సీపీకి చెందిన వ్యక్తని, కావాలనే దురుద్దేశంతో తమ కార్యకర్తలపై కేసు పెట్టారని కలరింగ్ ఇచ్చేందుకు ప్రయత్నించి భంగపడ్డారు. నిందితులను పంపడానికి పోలీసులు నిరాకరించడంతో స్టేషన్ నుంచి ఆలపాటి వెళ్లిపోయారు.

ఉపాధి హామీ పనులు ఎంతో ముఖ్యం..

కొల్లూరు: ఉపాధిహామీ పథకంలో భాగంగా పనిదినాలు చూయించి పనులు చేపట్టడం ఎంత ముఖ్యమో.. రికార్డుల నిర్వహణ అంతే ముఖ్యమన్న విషయం క్షేత్ర స్థాయి సిబ్బంది, పర్యవేక్షణ సిబ్బంది గుర్తించి రికార్డులను సక్రమంగా నిర్వహించాలని డ్వామా పీడీ బి.అర్జునరావు అన్నారు. శనివారం కొల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదికలో ఆయన పాల్గొన్నారు. ఆయన సామాజిక తనిఖీ బృందాలు మండలంలోని 24 పంచాయతీలలో నిర్వహించిన తనిఖీ రిపోర్టులను పరిశీలించారు. 2022-2023 ఆర్థిక సంవత్సరంలో రూ.5.36 కోట్ల విలువైన 1074 పనులను చేపట్టగా, అందులో పలు లోపాలను, అసంపూర్తిగా రికార్డుల నిర్వహణ అంశాలను ప్రజావేదికలో సామాజిక తనిఖీ బృందాలు పీడీ దృష్టికి తీసుకువచ్చాయి.

ఆంధ్రా నుంచి అంతర్జాతీయ స్థాయికి

- అత్యుత్తమ క్రీడాకారులను వెలికితీయడమే 'ఆడుదాం ఆంధ్రా' లక్ష్యం
- లోగో ఆవిష్కరించిన ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి

పట్నంబజారు: మట్టిలో మాణిక్యాలను వెలుగులోకి తీసుకొచ్చి.. వారి ప్రతిభకి మరింత పదును పెట్టడం ద్వారా అంతర్జాతీయ వేదికలపై సగర్వంగా నిలబెట్టాలనే సమోన్నత లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని శాసనమండలి ప్రభుత్వ విప్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి చెప్పారు. ఈనెల 26వ తేదీ నుంచి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించనున్న నేపథ్యంలో దానికి సంబంధించి ప్రత్యేకంగా రూపొందించిన లోగోను జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం బృందావన్ గార్డెన్స్‌లోని కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విప్ అప్పిరెడ్డి మాట్లాడుతూ మన ఆంధ్రప్రదేశ్ నుంచి అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను వెలికితీయడమే సీఎం జగన్ భావన అని తెలిపారు.



లోగోను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

ఆరోగ్యకరమైన జీవనశైలి, వ్యక్తిగత ఫిట్‌నెస్, చురుకుదనం కోసం క్రీడల ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. క్రమశిక్షణ, అంకితభావం, క్రీడాస్ఫూర్తి వంటి సాఫ్ట్ స్కిల్స్ నేర్చేందుకు క్రీడలు దోహదం చేస్తాయన్నారు. అంతే కాక ఉద్యోగ ఉపాధి కల్పనకు కూడా క్రీడలు ఉపకరిస్తాయి కనుకనే ఈ అతిపెద్ద క్రీడా పోటీల్లో పాల్గొనాలని కోరుతూ స్వయంగా ప్రభుత్వమే విద్యార్థి, యువజనులను ఆహ్వానిస్తోందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), షేక్ రోషన్, అచ్చాల వెంకట రెడ్డి, మార్కెట్ బాబు, నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పరిశపోగు శ్రీనివాసరావు, పార్టీ నాయకులు రబ్బానీ, మంత్రి మహానంది, వాకా సాంబిరెడ్డి, ఐతి సతీష్ పాల్గొన్నారు.

దారికాచి.. దోపిడీ చేసి..

- మంగళగిరి రైల్వేస్టేషన్ వద్ద ఘటన
- హైదరాబాద్ నుంచి దైవదర్శనానికి వచ్చిన కుటుంబం
- విచక్షణా రహితంగా దాడిచేసిన యువకులు

తాడేపల్లిరూరల్: మంగళగిరి రైల్వేస్టేషన్ వద్ద శనివారం తెల్లవారుజామున ఓ కుటుంబంపై మద్యం మత్తులో ఆరుగురు యువకులు దాడి చేసి, వారి వద్ద ఉన్న బంగారు వస్తువులతో పాటు సెల్‌ఫోన్లు లాక్కెళ్లారు. బాధితుల నుంచి సేకరించిన వివరాలు.. హైదరాబాద్‌లో నివాసం ఉండే నాగరాజు, తండ్రి సుబ్బారావు, తల్లి కామేశ్వరిలతో కలసి ముక్కోటి ఏకాదశి సందర్భంగా మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకునేందుకు రాయగడ ఎక్స్‌ప్రెస్‌లో మంగళగిరి రైల్వేస్టేషన్‌లో దిగారు. గుడి దగ్గరకు వెళ్లేందుకు బయటకు వస్తుండగా మార్గ మధ్యంలో అగ్నిమాపక కేంద్రం వద్ద మద్యం మత్తులో ఆరుగురు యువకులు అడ్డుకున్నారు. వారిని చితకబాది వంటిపై ఉన్న బంగారం, సెల్ ఫోన్ ఇవ్వాలని బెదిరించడంతో తల్లి కామేశ్వరి తన మెడలో ఉన్న 80 వేలు విలువ చేసే బంగారు గొలుసు, తండ్రి జేబులో ఉన్న సెల్‌ఫోన్ ఇచ్చివేయడంతో ఆరుగురిలో ఇద్దరు యువకులు మంగళగిరి బస్టాండ్ వైపు, మరో ఇద్దరు యువకులు రైల్వేట్రాక్ వైపు, ఇంకో ఇద్దరు యువకులు రాయల్ గ్యాస్ కంపెనీ వైపు పరుగులు తీశారు. ఘటనపై నాగరాజు తనపై మద్యం మత్తులో ఆరుగురు యువకులు దాడిచేసి బంగారం, సెల్‌ఫోన్‌ను లాక్కెళ్లినట్లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భరతముని జయంత్యుత్సవం

కూచిపూడి(మొవ్వ): అఖిల భారత కూచిపూడి నాట్య కళామండలి ఆధ్వర్యాన నాట్యక్షేత్రం కూచిపూడిలోని శ్రీసిద్ధేంద్ర యోగి కళావేదికపై శనివారం సాయంత్రం జరిగిన భరతముని జయంత్యుత్సవం ఆహూతులను విశేషంగా ఆకట్టుకుంది. యూఎస్‌ఏకు చెందిన దేవులపల్లి కుటుంబ సభ్యుల సౌజన్యంతో కళామండలి కార్యదర్శి పసుమర్తి మృత్యుంజయశర్మ ఆధ్వర్యంలో సాగిన ఉత్సవాల్లో కూచిపూడి, చెన్నై, కేరళ, భువనేశ్వర్, అమెరికాకు చెందిన కళాకారులు ప్రదర్శించిన నాట్యాంశాలు ఆకట్టుకున్నాయి. సంస్కార భారతి విజయవాడ ప్రధానకార్యదర్శి దుర్భా శ్రీనివాస్, కళారత్న, సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత వేదాంతం రాధేశ్యాం, ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల నాట్యాచార్యులు పసుమర్తి శ్రీనివాసశర్మ తదితరులు భరతముని, అఖిలభారత కూచిపూడి నాట్య కళామండలి మాజీ కార్యదర్శి పసుమర్తి కేశవప్రసాద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పసుమర్తి మృత్యుంజయశర్మ, హరినాథశాస్త్రితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు.

వైఎస్సార్ సీపీ యువజన విభాగంలో పలువురికి పదవులు



నరసరావుపేట: పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పల్నాడు జిల్లాలోని పలు నియోజకవర్గాల్లోని వైఎస్సార్ సీపీ యువజన విభాగం మండలాలకు అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. వినుకొండ పురపాలక సంఘానికి అత్తర్ నాగూర్‌వలి, చాగంటి యోగేశ్వరరావు(వినుకొండ రూరల్), అల్లా సాంబిరెడ్డి(బొల్లాపల్లి), కొండమీద తులసి(ఈపూరు), మల్లిశెట్టి నరేష్(శావల్యాపురం), నీలం సతీష్(నూజెండ్ల) నియమితులయ్యారు.

సత్తెనపల్లి నియోజకవర్గం..

తేలుకుట్ల సైదారావు(సత్తెనపల్లి), శెట్టి ఆనంద్(సత్తెనపల్లి పట్టణం), బెల్లంకొండ మాబుసుభాని(ముప్పాళ్ల), బత్తుల శివయ్య(రాజుపాలెం).

పెదకూరపాడు నియోజకవర్గం..

షేక్ బాజి(పెదకూరపాడు), బచ్చిన శ్రీనివాసరావు(అమరావతి), బండిగోపి(అచ్చంపేట), బద్దూరి శేషిరెడ్డి(బెల్లంకొండ), వేజెండ్ల రాఘవరావు(క్రోసూరు).

మాచర్ల నియోజకవర్గం..

కాయకోకుల రామాంజి(వెల్దుర్తి), మున్నా రామకృష్ణ(మాచర్ల రూరల్), షేక్ మస్తాన్(మాచర్ల టౌన్), చిలుకూరి చంద్రశేఖరరెడ్డి(కారెంపూడి), యకటిల బుచ్చిబాబు(దుర్గి), కొమ్మారెడ్డి సతీష్‌కుమార్‌రెడ్డి(రెంటచింతల).

గురజాల నియోజకవర్గం..

జక్కా సత్యం(గురజాల టౌన్), దుగ్గిరాల రాజశేఖరరెడ్డి(గురజాల), మందా సుధీర్(పిడుగురాళ్ల టౌన్), బొలినీడి నాగరాజు(పిడుగురాళ్ల), నాగెండ్ల అనీల్(దాచేపల్లి టౌన్), కాసర్ల నరసింహారెడ్డి (దాచేపల్లి), మద్దు ప్రసాదు(మాచవరం).

చిలకలూరిపేట నియోజకవర్గం..

ధూమల జోజిరెడ్డి(నాదెండ్ల), కొప్పుల శామ్యూల్ పాల్(యడ్లపాడు), బొల్లేపల్లి అనీల్‌బాబు(చిలకలూరిపేట రూరల్), కందుల శ్రీకాంత్(చిలకలూరిపేట మున్సిపాలిటీ).

డాక్టర్ యజ్ఞనారాయణరెడ్డికి అంతిమ వీడ్కోలు



డాక్టర్ యజ్ఞనారాయణరెడ్డి భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి, పానెం హనిమిరెడ్డి తదితరులు

నరసరావుపేట: ప్రముఖ యూరాలజిస్ట్ డాక్టర్ కోనుగంటి యజ్ఞనారాయణరెడ్డి(62) అంత్యక్రియలు శనివారం నిర్వహించారు. అనారోగ్యంతో శుక్రవారం హైదరాబాద్‌లో మృతిచెందిన ఆయన భౌతిక కాయాన్ని స్వగృహానికి తీసుకొచ్చారు. టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి దంపతులు సందర్శించి నివాళులర్పించారు. వీరితో పాటు ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి, వైవీ సోదరుడు భద్రారెడ్డితో పాటు పలువురు డాక్టర్లు, రాజకీయ నాయకులు మృతదేహాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. అంతిమ యాత్రలో వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే గోపిరెడ్డి, బత్తుల బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు. గుంటూరు రోడ్డులోని స్వర్గపురి శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. నివాళులర్పించిన వారిలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఏఏవీ రామలింగారెడ్డి, కడియాల వెంకటేశ్వరరావు, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి సయ్యద్ జిలాని, డాక్టర్ గజ్జల బ్రహ్మారెడ్డి, డాక్టర్ కొండపల్లి వెంకటేశ్వర్లు, వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యులు ఓరుగంటి శేషిరెడ్డి, డాక్టర్ కామిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఇంజినీర్ కొమ్మసాని కమలాకరరెడ్డి ఉన్నారు.



డాక్టర్ యజ్ఞనారాయణరెడ్డి అంతిమయాత్ర

అంతర జిల్లాల చైన్‌స్నాచర్ అరెస్టు

- బంగారం ఆభరణాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

నరసరావుపేట: మహిళల మెడల్లో బంగారు చైన్లు దొంగతనం చేసే ఒంగోలుకు చెందిన అంతర్ జిల్లా చైన్‌స్నాచర్ అరెస్ట్ చేశారు. శుక్రవారం పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. ఒంగోలు విజయనగర్‌కు చెందిన షేక్ కృపారావు ఒంటరిగా వెళ్తున్న మహిళల మెడలలోని బంగారపు గొలుసులు చోరీకి పాల్పడుతుంటాడు. నకరికల్లు గ్రామం గుండా వెళ్లే అద్దంకి- నార్కెట్‌పల్లి స్టేట్ హైవే పక్కన ఉన్న సర్వీస్ రోడ్‌లో ఇల్లు, కిరాణా షాపు ఉన్న కాళంగి వెంకట రత్నం ఈనెల ఐదున భర్త పనిమీద సెంటర్‌కు వెళ్లగా షాపు ముందు రోడ్ పక్కన కుర్చీ వేసుకొని కూర్చుంది. అదే సమయంలో ఎవరో గుర్తుతెలియని వ్యక్తి వారి షాపుకి వస్తున్నట్లుగా వచ్చి ఆమె మెడలోని బంగారు నానుతాడును లాగి తెంపుకొని పారిపోయాడు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు నకరికల్లు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. సత్తెనపల్లి డీఎస్పీ బి.ఆదినారాయణ పర్యవేక్షణలో రూరల్ సీఐ ప్రేమయ్య ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. తనిఖీలు నిర్వహిస్తుండగా మోటార్ సైకిల్ పారిపోతుండగా వెంబడించి పట్టుకున్నారని తెలిపారు. వీరి నుంచి 280.33 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో మొత్తం 15 కేసులు ఉన్నట్లు వివరించారు. చోరీ సొత్తు స్వాధీనాన్ని ప్రత్యక్షంగా పర్యవేక్షించిన సత్తెనపల్లి డీఎస్పీ బి.ఆదినారాయణ దర్యాప్తు బృందంలోని ఎస్ఐ బాలకృష్ణ, హెడ్‌కానిస్టేబుల్ కె.శ్రీను, కానిస్టేబుల్ ఎస్.పార్థసారథి, డి.చెన్నకేశవులు, ఓ శ్రీనివాసులు, ఎస్.శ్రీనివాసరావు, హోమ్‌గార్డు సీహెచ్‌కోటిరెడ్డిలను ఎస్పీ అభినందించారు.